www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 3 మార్చి 2025



విద్యతోనే వెలుగులు

ప్రజాశక్తి కడప అర్బన్ : విద్య ద్వారా పేద జీవితాల్లో వెలుగులు వస్తాయని మన్ ఛారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.ఎ. ఫరూక్ అన్నారు. ఆదివారం రంజాన్ మాసం సందర్భంగా పేదలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ఏర్పాటు నుంచి జకాత్ ద్వారా ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నామని చెప్పారు. పేదల వ్యక్తిగత అవసరాలకు తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. టిడిపి నాయకులు అమీర్ బాబు మాట్లాడుతూ ప్రతి ముస్లిమ్ జకాత్ విధిగా ఇవ్వాలన్నారు. పేద విద్యార్థులను ఆదుకోవడం చిరస్మరణీయం అన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా మాట్లాడుతూ రంజాన్ మాసంలో జకాత్‌ను ప్రతి ముస్లిం చెల్లించాలని పేర్కొన్నారు. వాటిని ఎక్కువ మంది పేద విద్యార్థుల విద్యకై, ఉజ్వల భవిష్యత్తు కై కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మన్సూర్ అలీ ఖాన్, కార్పొరేటర్ ఆస్మతుల్లా, ఎస్టియు జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా పాల్గొన్నారు.

టైల్స్ రాక..నాపరాయి పోక

- కడప స్టోన్స్‌కు ఆదరణ కరువు
- తగ్గిన వ్యాపారం
- పెరిగిన విద్యుత్ ఛార్జీలు, రాయల్టీలు
- ఆందోళనలో కార్మికులు, పరిశ్రమ యజమానులు



ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

ఒకప్పుడు కడప స్టోన్స్ పేరుతో ఎర్రగుంట్ల నాపరాయి ఎంతో ప్రాముఖ్యం సంతరించుకుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టైల్స్, గ్రానైట్ , మార్బుల్స్ రావడంతో నాపరాయి వాడకం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో నాపరాయి వ్యాపారం అధోగతి పాలవుతోంది. పరిశ్రమల యజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోడల నిర్మాణానికి గోడ రాయి, సపట వేసేందుకు, షోకేసులకు, వాకిలి, గూటి కప్పులకు ఇలా పలు రకాలుగా గృహ అవసరాలకు నాపరాయిని వాడేవారు. ప్రస్తుతం నాపరాయి వినియోగం చాలా తగ్గింది. పాలిష్ రాయి వ్యాపారాలు లేక పరిశ్రమల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంద ఏళ్ల నుంచి నాపరాయినే వాడుతున్నారు. 50 సంవత్సరాలుగా పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి పొందుతున్నారు. 2003లో తోపడా యంత్రాలు రాకతో ఉత్పత్తి పెరగడంతో పాటు, వ్యాపారం పుంజుకుంది. కానీ ప్రస్తుతం వ్యాపారాలు లేకపోవడంతో పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు పని కరువైంది. నెలలో 15 రోజులు మాత్రమే పనులు చేయించుకుంటున్నారు. పట్టణంలో సుమారు 200 పరిశ్రమలున్నాయి. వాటికి అనుసంధానంగా ఉపాధి పొందుతున్న వారు సుమారు పదివేల మంది ఉన్నారు. గనులలో రాయి తీసేవారు, గనుల వద్ద నుంచి మిషన్లకు రాయి తరలించేవారు, మిషన్ల వద్ద రాయి పాలిష్ చేసి తయారు చేసేవారు, ట్రాక్టర్లు, లారీలతో పాటు ఎగుమతులకు వినియోగించే ట్రక్కు డ్రైవర్లు ఇలా చాలామంది నాపరాయి మిషన్లకు అనుసంధానంగా ఉపాధి పొందుతున్నారు. గతంలో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలతో పాటు పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు ఎక్కువగా నాపరాయి ఎగుమతులు అయ్యేవి. 20 ఏళ్ల కిందట అట్టపెట్టెలలో నాపరాలను ప్యాక్ చేసి షిప్‌ల ద్వారా అమెరికా తదితర దేశాలకు ఎగుమతులు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఒక్క తమిళనాడు రాష్ట్రానికే ఎగుమతులు జరుగుతున్నాయి. మారుతున్న కాలానుగుణంగా నాపరాయి బదులు టైల్స్, గ్రానైట్, మార్బుల్ వాడకం పెరిగింది. నాపరాయి తయారీ ఖర్చు పెరిగింది. కానీ అధునాతన యంత్రాలతో(3డి) రంగురంగుల టైల్స్ ఖర్చు తక్కువలో తయారవడం, పైగా వినియోగదారులకు ధర తక్కువ ధరకు టైల్స్, గ్రానైట్ రాయి దొరకడంతో నాపరాయి మరుగున పడింది. ఈ క్రమంలో ధరలు దాదాపు సమానంగా అవడంతో వినియోగదారులు తక్కువ బరువుతో కంటికి ఇంపుగా ఉన్న టైల్స్ నే ఎక్కువగా వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో నాపరాయి వ్యాపారం లేకపోతే వేల మందికి ఉపాధి కరువు అయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం సహకరించి రాయల్టీ, విద్యుత్ బిల్లులు తగ్గించాలని పలువురు కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలకు, నిర్మాణాలకు నాపరాయిని వాడడం వల్ల వ్యాపారం వస్తుందని పలువురు పరిశ్రమలు యజమానులు అభిప్రాయపడుతున్నారు.



పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు

వ్యాపారం పూర్తిగా తగ్గింది

నాపరాయి వ్యాపారం గతంలో ఎన్నడూ లేని విధ ంగా పూర్తిగా తగ్గిపో యింది. కార్మికుల కూలి ఖర్చులు పెరిగి పోయాయి. దీంతో పాటు విద్యుత్ ఛార్జీలు పెంచారు. రాయల్టీ పెం చారు. డిమాండ్ తగ్గడంతో ఉత్పత్తి అయిన పాలిష్ నాపరాయి స్టాకు చాలా ఉండిపోయింది. ఒక అడుగు పాలిష్ రాయి తయారీ ఖర్చు రూ. 23 పడుతుంది. అదే ధరకు అమ్ముతున్నాం. వ్యాపారంలో ఏమి మిగలడం లేదు. ఆర్డర్లు రావడం లేదు. రెండు లోడ్లు స్టాకు ఉండిపోయింది. పరిశ్రమను నడపడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ నిర్మాణాలకు నాపరాయిని వినియోగించాలని కోరుతున్నాం.



- కిరణ్, పాలిష్ మిషన్ యజమాని

15 రోజులు మాత్రమే పనులు



వ్యాపారాలు లేకపోవడంతో పనులు నెలలో 15 రోజులు మాత్రమే చేయించుకుంటున్నాం. గతంలో వారానికి ఒకలోడు పోయేది. కానీ ప్రస్తుతం నెలకు ఒక లోడు మాత్రమే పోతోంది. కార్మికులకు ఉపాధి కంటిన్యూగా చూపలేక పోతున్నాం. అయినా ఖర్చు మాత్రం పెరిగిపోయింది. పాలిష్ రాయి లోడ్లు తమిళనాడుకు పంపించిన డబ్బులు రావడం లేదు. టైల్స్, గ్రానైట్, మార్బుల్ వాడకం పెరగడంతో పాలిష్ రాయి వాడకం తగ్గిపోయింది. రాయితో పోల్చుకుంటే చూసేందుకు టైల్స్ బాగుంటాయని వినియోగదారులు ఇష్టపడుతున్నారు. రాయి ఎక్కువ కాలం మన్నిక వస్తుంది వినియోగదారులు గుర్తించాలి.

- హరి ప్రసాద్ రెడ్డి, పాలిష్ మిషన్ యజమాని

ఖర్చులు బాగా పెరిగాయి



మిషన్ల బాడుగలు, కరెంటు బిల్లులు ఇతరత్రా ఖర్చులు పెరిగాయి. ముతకరాయి రేటు కూడా పెరిగింది. దీంతో తయారీ ఖర్చు విపరీతంగా పెరిగింది. రాయికి డిమాండ్ లేకపోవడంతో తక్కువ ధరకు ఇస్తున్నాం. అయినా తోలిన రాయికి డబ్బులు రావడం లేదు. కార్మికుల దినసరి ఖర్చులు, కూలి పెరిగాయి. కార్మికులకు, ఇతరులకు బాకీ కట్టి పనికి వచ్చేందుకు లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చాం. వ్యాపారంలో పెట్టుబడులు పెట్టాం. కనుక వేరే వ్యాపారంలోకి వెళ్లలేక నలిగిపోతున్నాం.

- శివారెడ్డి,పాలిష్ మిషన్ యజమాని

వేతన జీవులకు నిరాశే

- సిఐటియు ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలియజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-బద్వేల్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వేతన జీవులను పూర్తిగా విస్మరించిందని సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీని వాసులు పేర్కొన్నారు. సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వ ర్యంలో 2025 -26 బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో బడ్జెట్ ప్రవేశపెడుతున్నారంటే వేతనాలు పెరుగుతాయని, ఎదురుచూసే వేతన జీవుల ఆశలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి అడియాశలు చేశారని పేర్కొన్నారు. 2025 -26 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ ప్రసంగంలో కొన్ని పథకాల అమలు కోసం కేటాయింపులు చేస్తామన్నారే తప్ప జీతాల కోసం పనిచేస్తున్న కార్మికులకు చోటు ఇవ్వలేదని వాపోయారు. ముఠా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు హామీ గురించి ప్రస్తావించలేదని చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామన్న హామీకి అతీగతీ లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం దొడ్డిదారిన వాడేసుకున్న బిల్డింగ్ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను ఈ బడ్జెట్‌లో జమ చేయలేదని, రాష్ట్రంలోని లక్షలాదిమంది కాంట్రాక్ట్ -అవుట్సోర్సింగ్ కార్మికులు తమకు మినిమం టైమ్ స్కేల్ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని పెట్టుకున్న ఆశలపై తెలుగుదేశం కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పిఆర్‌సి, ఐఆర్ చెల్లింపు ఊసే లేదని, వారికి చెల్లించాల్సిన వేలాది కోట్ల బకాయిల ప్రస్తావన, ఒపిఎస్ పునరుద్ధరణ వంటి విషయాలను చర్చించలేదని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు, స్కీముల్లో లక్షల మంది పైగా పనిచేస్తున్నారని చెప్పారు. వారికి సంక్షేమ పథకాల వర్తింపు హామీ ప్రస్తావన బడ్జెట్లో లేకపోవడం శోచనీయమన్నారు. షాపింగ్ మాల్స్, ప్రయివేట్ ఆస్పత్రులు, విద్యాసంస్థలు, పెట్రోల్ బంకులు, హోటల్స్ తదితర వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్న దాదాపు 50 లక్షల మంది కార్మికుల వేతనాలు 2006-2007 తర్వాత ఇంతవరకు పెంచలేదని చెప్పారు. ఈ బడ్జెట్‌లో కూడా వారి వేతనాల పెంపుపై ప్రస్తావించలేదన్నారు. కార్మికుల వేతనాల కోసం సంక్షేమం కోసం తగిన విధంగా బడ్జెట్ ప్రతిపాదనలలో తగిన మార్పులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పులిశ్యాం ప్రవీణ్, ఇరుపోతు ఓబులేసు, పట్టణ కన్వీనర్ కె. నాగేంద్రబాబు, కో-కన్వీనర్ పి.సి. కొండయ్య, పట్టణ నాయకులు జి.నాగార్జున, డి.హరి, కె.శివకుమార్, జి.హుస్సేన్, ఓ.ప్రవీణ్ కుమార్, కరీం,ఓబులేసు, మైఖేల్, కె.సుభాషిణి, అరుణ కుమారి, జయప్రద రత్నమ్మ,ప్రవీణ, బాలమ్మ, రాజేష్, నాగరాజు,రాయప్ప,మోక్షమ్మ, ప్రసాదు, వెంకటేశ్వర్లు, రాజారాం, చెన్నకేశవ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు మొండి చేయి: డివైఎఫ్ఐ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కడప జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని ముఖ్యంగా యువతకు భరోసా లేదని, సూపర్ సిక్స్‌లో భాగమైన నిరుద్యోగ భృతి, వాలంటీర్లకు ఇచ్చిన హామీ లేదని డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ముఖ్యంగా జిల్లా ప్రజలు రాష్ట్ర బడ్జెట్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని చెప్పారు. తీరా బడ్జెట్ చూస్తే ఆశలపై నీళ్లు చల్లినట్టు అయిందని వాపోయారు. కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించకపోవడం దారుణమని పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కడప ఉక్కు పరిశ్రమ పై కపట నాటకాలు ఆడుతున్నాయని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ లో ప్రధాన భాగమైన నిరుద్యోగ భృతి రాష్ట్రంలోని చదువుకున్న నిరుద్యోగులకు ప్రతినెల 30 వేల రూపాయలు ఇస్తామని చెప్పి ఎన్నికలలో హామీ ఇచ్చిన ప్రభుత్వం గడచిన ఎన్ని నెలలైనా ఆ హామీ నెరవేరే కార్యరూపణ దాల్చలేదన్నారు ఇప్పటికైనా జరుగుతున్న బడ్జెట్ సమావేశాలలో యువజన హామీ అయిన కడప ఉక్కు పరిశ్రమకు నిధుల కేటాయించాలని, నిరుద్యోగ భృతి నిరుద్యోగి రూ. 3 వేలు , వాలంటీర్లకు ఇచ్చిన హామీని అమలు పరచాలని డిమాండ్ చేశామన్నారు.

రంజాన్ రేషన్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -కడప అర్బన్

కడప నగరంలోని అల్మాస్‌పేటలోని జామియతుస్సాలిహత్ మదరసాలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బియ్యం ప్యాకెట్లతో పాటు రంజాన్ రేషన్ కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు సభ్యులు మౌలానా దావూద్ బాక్వి సాహెబ్, ప్రముఖులు అఫ్సర్ ఖాన్, సయ్యద్ అహ్మద్ బాషా (బాబు భాయ్) హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ వారు ప్రతి సంవత్సరం లాగానే ఈ సారి రంజాన్ కిట్లు పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. 215 మందికి రంజాన్ రేషన్ కిట్లను పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎఫ్. ఎం.ముక్తార్ అహ్మద్, మదరస ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలు అవసరం

ప్రజాశక్తి-కాశినాయన



కేన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి పుష్ప

కేన్సర్ నివారణకు ముందస్తు పరీక్షలు ఎంతో అవసరమని నరసాపురం ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పుష్ప పేర్కొన్నారు. మండల పరిధిలోని రంపాడు ఆరోగ్య ఉపకేంద్ర పరిధిలోని ఉప్పలూరులో ప్రజలకు కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. 25 మంది కేన్సర్ అనుమానుతులను గుర్తించారు. వారిలో ఐదుగురిని కడప రిమ్స్‌కు నిర్ధారణ కోసం పంపారు. ఈసందర్భంగా డాక్టర్ పుష్ప మాట్లాడుతూ ఉప్పలూరులో ఎక్కువగా దురాలవాట్లు ఉండటం వల్ల రంపాడు ఆరోగ్య ఉపకేంద్ర సిహెచ్‌ఒ శ్రీనాథ్ గమనించి ఇక్కడ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అక్కడ ఉన్న గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు, మద్యపానం, ధూమపానం, గుట్కా,ఖైని తంబాకు పాన్ వంటివి నోటిలో నమ్మడం వల్ల కేన్సర్ వచ్చే ప్రమాదముందని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ రోజు వ్యాయామం చేయాలన్నారు. ఆరోగ్య కరమైన సంపూర్ణమైన పోషక ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసాపురం ఆరోగ్య కేంద్రం సిహెచ్‌ఒ నిర్మల, రంపాడు ఆరోగ్య ఉపకేంద్ర సిహెచ్‌ఒ శ్రీనాథ్, ఎన్ఎం రమణమ్మ, ఇతర ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌస్‌పీర్ దీక్షకు సంఘీభావం

ప్రజాశక్తి-కడప అర్బన్

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలంటూ పీస్ స్కూల్ యజమాని, కాంగ్రెస్ పార్టీ కడప నియోజకవర్గ మాజీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి సయ్యద్ గౌపీర్ 36 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఆదివారం ఇందిరా గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షకు ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ సంఘీభావం తెలిపారు. పూలమాల వేసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సలావుద్దీన్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లౌకిక దేశంలో బిజెపి మతాలను టార్గెట్ చేస్తూ కక్ష సాధింపులకు దిగుతుందని విమర్శించారు. ముస్లిం సమాజం పట్ల వివక్ష విడాలని పేర్కొన్నారు. దీక్షకు వివిధ పార్టీల, ప్రజా సంఘాల, స్వచ్ఛంద సంస్థల నాయకులు సంఘీభావం తెలిపారు.



గౌస్‌పీర్‌కు పూలమాల వేస్తున్న సలావుద్దీన్

ఆదాయపన్నును సక్రమంగా చెల్లించాలి

- రాష్ట్రంలో పన్ను ఎగవేతదారులే ఎక్కువ
- చెల్లింపు దారులు తగ్గారు
- ఆదాయ పన్ను శాఖ ఉమ్మడి రాష్ట్ర చీఫ్ ప్రిన్సిపల్ కమిషనర్ మిథాలి మధుస్మిత



అధికారులను సన్మానిస్తున్న పఠాన్ షరీఫ్‌ఖాన్

ప్రజాశక్తి - కడపఅర్బన్

తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయపన్ను చెల్లింపుదారులు తగ్గిపోయారని, దీంతో రాబడి తగ్గిపోయిందని, వ్యాపారులు ఆదాయాన్ని పెంచుకొని ఎక్కువ మొత్తంలో ఆదాయపన్ను చెల్లించాలని ఆదాయపన్ను శాఖ ఉమ్మడి రాష్ట్ర చీఫ్ ప్రిన్సిపల్ కమిషనర్ మిథాలి మధుస్మిత కోరారు. ఆదివారం ఆదాయపన్ను కార్యాలయంలో మిథాలి మధుస్మితతో పాటు చీఫ్ కమిషనర్ సురేష్ బత్తిని, ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్లా, అడిషనల్ కమిషనర్ శ్రీధర్‌ను ఎపి ఆర్డిటర్స్ అసోసియేషన్ చీఫ్ అడ్వయిజర్, రాష్ట్ర మాజీ అధ్యక్షులు పఠాన్ షరీఫ్‌ఖాన్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మధుస్మిత మాట్లాడుతూ సకాలంలో ఆదాయపన్ను చెల్లించి రాష్ట్ర, దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పన్ను ఎగవేతదారుల ఎక్కువయ్యారని, తమ వ్యాపారానికి తగ్గట్టుగా పన్ను చెల్లించడం లేదని పేర్కొన్నారు. ఆదాయ పన్నులు మినహాయింపు లేకున్నా క్లయిమ్స్‌కు ప్రయత్నం చేసి రిఫండ్ తీసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటివారిని ఉపేక్షించేది లేదని, నోటీసులు ఇచ్చి పన్నులు రాబడతామని చెప్పారు. సురేష్ బత్తిని మాట్లాడుతూ అనేకమంది వ్యాపారులు కోట్లల్లో వ్యాపారం చేస్తూ పన్ను ఎగవేస్తున్నారని పేర్కొన్నారు. వీరంతా రిటర్న్స్ ఫైల్ చేసి పన్ను చెల్లించాలని చెప్పారు. సునీత బిల్లా మాట్లాడుతూ వ్యాపారులు సక్రమంగా టాక్స్ చెల్లిస్తే ఎటువంటి నోటీసులు, చట్టపరమైన చర్యలు ఉండవని తెలిపారు. టాక్స్ ఎగవేతకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పటాన్ షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ ప్రతి వ్యాపారుడుటాక్స్ చెల్లించేలా సూచనలు, సలహాలు ఇస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరిని టాక్స్ పరిధిలోకి తెచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. స్క్రూట్ నీ విషయంలో వ్యాపారుల పట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారని, స్క్రూటీని సరళతలం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్లు సత్యనారాయణ, పి.వి.రమణ, చార్టెడ్ అకౌంటెంట్లు, ఇన్కమ్ టాక్స్ ఆడిటర్లు, ఆదాయపన్ను శాఖ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయం

- ◆ టెన్త్, ఇంటర్‌ల్లో మెరుగైన ఫలితాలు తథ్యం
- ◆ పకడ్బందీగా పంచతంత్ర ప్రణాళిక అమలు
- ◆ డిసిఇబి మెటీరియల్ చదివించడంపైనే దృష్టి
- ◆ ఎస్ఎస్ఎపిసి ఎ.నిత్యానందరాజులు వెల్లడి



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టెన్త్, ఇంటర్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. గతేడాదికి మించిన ఫలితాల సాధనకు పంచతంత్ర ప్రణాళికను పకడ్బందీగా అమలు చేస్తున్నాం. దీనికితోడు సబ్జెక్టు నిపుణుల పర్యవేక్షణలో డిసిఇబి మెటీరియల్ అధ్యయనంపై ప్రధానంగా దృష్టి సారించాం. వీటితోపాటు టెన్త్, ఇంటర్ విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా ఎ,బి,సి,డి గ్రేడులుగా విభజించడం, గ్రూపు చర్చలు నిర్వహించడం వంటి పద్ధతుల ద్వారా ఉత్తమ ఫలితాల సాధనపై ప్రాథమిక అవగాహన కలిగింది. ఇటువంటి అవగాహన ద్వారా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా ఫోకస్ చేయడానికి అవకాశం లభించింది. దీంతోపాటు మూడేళ్లుగా వెనుకబడిన కెజిబివిలపై ప్రత్యేకంగా దృష్టి సారించడం ద్వారా టెన్త్, ఇంటర్ ఉత్తమ ఫలితాలు సాధిస్తామనే ధీమాను వ్యక్తం చేస్తున్న సమగ్రశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎ.నిత్యానందరాజులుతో ముఖాముఖి..

కెజిబివి పాఠశాలలు ఎన్ని, విద్యార్థుల సంఖ్య ఎంత?

జిల్లాలో 17 కెజిబివి పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఆరవ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు 4,209 మంది ఉన్నారు.టెన్త్, ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకెండర్ ఇయర్ విద్యార్థులను లెక్కిస్తే 1,532 మంది ఉన్నారు. వీరితోపాటు మూడు ఎపిఎంఎస్ పాఠ శాలలకు చెందిన 274 మందితో కలిపి లెక్కిస్తే 4,483 మంది ఉన్నారు.

గతేడాది ఉత్తమ ఫలితాలు సాధించిన కెజిబివిలెన్ని?

జిల్లాలోని 17 కెజిబివి పాఠశాలల్లో 10 పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి. మిగిలిన ఏడు కెజిబివిలు సైతం మోస్తరు ఫలితాలను సాధించాయి. ప్రస్తుత ఏడాది వెనుకబడిన కెజి బివిలపై ప్రత్యేక దృష్టి సారించాం. రోజూ మానిటరింగ్ చేయడంతోపాటు సబ్జెక్టు నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేక స్టడీఅవర్స్ నిర్వహిస్తున్నాం.

పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత ఎలా ఉంది?

ఎస్ఎస్ఎ పరిధిలోని కెజిబివిలకు చెందిన టెన్త్, ఇంటర్ విద్యార్థులను ఎ, బి, సి, డి గ్రేడ్ల వారీగా విభజించడం, వెనుకబడిన విద్యార్థులను మెరుగైన వారితో కలిపి చర్చలు చేయడంతో పాటు సంబంధిత సబ్జెక్టు నిపుణుల పర్యవేక్షణలో స్టడీఅవర్స్ నిర్వహించడం వంటి పద్ధతులతో ప్రణాళికాబద్దంగా ముందుకెళ్తున్నాం.

ఉత్తమ ఫలితాలకు అనుసరిస్తున్న వైఖరేమిటి?

ప్రత్యేక వైఖరులంటూ ఏమీ లేవు. రాష్ట్ర విద్యాశాఖ అందించిన పంచతంత్ర ప్రణాళికను ఫాలో కావడం, డిసిఇబి మెటీరియల్‌ను క్షుణ్ణంగా చదివించడం ఆధారంగా మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం. వీటితోపాటు మోటివేషనల్ తరగతులను నిర్వహించడం ద్వారా విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నాం.

గతేడాది కెజిబివి పాఠశాలల ఉత్తీర్ణతా శాతం ఎంత?

గతేడాది పదవ తరగతిలో 96.4 శాతం ఉత్తీర్ణత సాధించాం. ఇంటర్‌లో ఫస్ట్‌ఇయర్‌లో 62 శాతం, సెకెండ్ ఇయర్‌లో 72 శాతం ఫలితాలను సాధించాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గతేడాది ఫలితాలను, ఉత్తీర్ణతా శాతాన్ని అధిగమించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాం. ఇందులో సింహాద్రిపురం కెజిబివి పాఠశాలకు చెందిన విద్యార్థిని 583 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది.

వృత్తికోర్సుల శిక్షణ, కెరీర్‌గైడెన్స్ అందించే ఆలోచనలు ఏమైనా ఉన్నాయా?

నీట్, జెఇఇ పోటీ పరీక్షల శిక్షణ తమ పరిధిలోని కావు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ లక్ష్యాల మేరకు ముందుకెళ్లడమే తమ పని. ఇంటర్ అనంతరం విద్యార్థినులు సొంతంగా బతకడానికి అవ సరమైన బ్యూటిషియన్, ఫుడ్‌ప్రాసెసింగ్, అగ్రికల్చర్, ఐటి, ఐటిఎస్, అపెరల్ డిజైనింగ్ వంటి కోర్సులు నేర్పించడంతోపాటు సర్టిఫికెట్లు ఇస్తున్నాం.

హామీల అమలులో విఫలం : వైసిపి

ప్రజాశక్తి - కడప



మీడియాతో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

ఎన్నికల సమయంలో ఇచ్చి న హామీలను కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా విఫలమైందని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్‌తోపాటు 143 హామీలు మేనిఫెస్టోలో చెప్పి ప్రజల్ని మోసం చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంపదను ఎలా సృష్టిస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ ఏడాది పింఛన్లలో కోత విధించారని ఆరోపించారు. ఆడబిడ్డ నిధి అని గొప్పలు చెప్పారని, బడ్జెట్‌లో వారికి కేటాయింపులే లేవని వాపోయారు. నిరుద్యోగభృతి, ఉచిత బస్సు ఊసే లేదని పేర్కొన్నారు. తల్లికి వందనంకు అరకొర నిధులు కేటాయించారని విమర్శించారు. పోసానికి ఆరోగ్యం బాగాలేకపోయినా, గుండె ఆపరేషన్ జరిగినా కక్ష సాధింపునకు దిగారని చెప్పారు. రెండు రోజుల పాటు జీపుల్లో తిప్పి ఆయన్ను నానా రకాలుగా ఇబ్బంది పెడుతున్నారు అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి కుమార్, నాగేంద్ర రెడ్డి, షఫీ, శ్రీ రంజన్ రెడ్డి, దత్త సాయి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -వల్లూరు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కడప - తాడిపత్రి జాతీయ రహదారి గణేష్‌పురంలో అభ్యుదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం కడప మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ వంశీ విహారి, డాక్టర్ సాయిచరిత, హరి నారాయణ స్వామి రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో రక్త పోటు, మధుమేహంతో, పాటు మోకాళ్ల నొప్పులు, వెన్నునొప్పి, గర్భకోశ వ్యాధులకు వైద్యం ఉచితంగా అందించారు. అనంతరం మందులు ఉచితంగా అందజేశారు. అభ్యుదయ రూలర్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యనిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వంకదారి ఆంజనేయులు, తాడిగొట్లరమణారెడ్డి, పుల్లయ్య, మహేష్, సాయి, పాల్గొన్నారు.

కమలాపురం టౌన్ : కడప జిల్లా కమలాపురం నగర పంచాయతీ పరిధిలో ప్రైమ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి ముఖ్య అతిథులుగా ప్రైమ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ మహేష్ బృంగి, డాక్టర్ జాకోబ్, డాక్టర్ షాహిస్తా హాజరయ్యారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్ కుమార్ ట్రస్ట్ సభ్యులు విగ్నేష్, సునీల్, వీరశివా రెడ్డి, శీలం శ్రీనివాసులు ప్రైమ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సిబ్బంది కళ్యాణ్, లక్ష్మి నరసయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

డిఎస్‌సి-2003 నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- కడప అర్బన్

డిఎస్‌సి- 2003 ఫోరం నూతన కార్యవర్గ సమావేశం ఆదివారం జిల్లా పరిషత్ ఆవరణంలో నిర్వహించారు. డిఎస్‌సి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల సమావేశంలో జిల్లా ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గుజ్జల.తిరుపాల్, ప్రధాన కార్యదర్శిగా కావేటి ఉదయభాస్కర్, ట్రెజరర్‌గా కురుకూటి సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా మిద్దె ప్రవీణ్ కిరణ్, బండి.నాగేశ్వర్ రెడ్డి, కందుకూరు వీర ప్రతాప్, మహిళా కార్యదర్శులుగా సునీత, సుమలత, కరీమున్నీసా, సునీత ఎన్నికయ్యారు.


మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ తులసి నాగప్రసాద్

అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తులసి నాగప్రసాద్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆది వారం ఆయన మహిళల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక చట్టాలను తెచ్చిందన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా 'తోటంశెట్టి'

ప్రజాశక్తి - వేంపల్లె


తోటంశెట్టి చంద్రశేఖర్

వేంపల్లె మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా తోటంశెట్టి చంద్ర శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా తోటంశెట్టి చంద్రశేఖర్‌ను ఎన్నుకోగా, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా రాయవరం వెంకట సుబ్బారావు (సుబ్బు) ఎన్నుకున్నారు. ఈ నెల 9న వేంపల్లెలోని అమ్మవారిశాల వీధిలో ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు ఆర్యవైశ్య నాయకులు చెప్పారు. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్యే 'పుట్టా'కు సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


పుట్టా సుధాకర్ యాదవ్‌ను సన్మానిస్తున్న గానుగపెంట

తాను విద్యను బోధించిన శిష్యుడు, మైదుకూరు నియోజకవర్గ శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్‌ను చూసి గర్వపడుతున్నానని విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో ఆది వారం హనుమంతరావు పుట్టా సుధాకర్ యాదవ్‌ను సత్కరించి ఆశీర్వదించారు. అవినీతి అంతానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులు కావాలని గానుగపెంట అన్నారు.

సమస్యల్ని పరిష్కరించడం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలు చేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడం హర్షణీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆశా కార్యకర్తల ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 వరకు పెంచడంతోపాటు 30 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి ఉద్యోగ విరమణ అనంతరం రూ.1,50,000 గ్రాట్యుటీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం సంతోషకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 42,752 మంది ఆశా వర్కర్లకు లబ్ధి చేకూరుతుందన్నారు. 180 రోజుల పాటు ఇచ్చే ప్రసూతి సెలవుల సమయంలో వేతనం ఇవ్వాలనే నిర్ణయం కూడ మంచిదన్నారు. ఆశా వర్కర్లు ప్రశంసనీయమైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీల సమస్యలను కూడా పరిష్కరించాలని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.


ఎఎం రత్నంకు స్వీయ చిత్రపటాన్ని బహూకరిస్తున్న చిత్రకారుడు

ఎఎం రత్నంకు స్వీయ చిత్రం బహూకరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

చలనచిత్ర నిర్మాత, గేయ రచయిత, కథా రచయిత, దర్శకుడు ఎం రత్నంకు ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రామాంజనేయరెడ్డి స్వీయ చిత్రపటాన్ని ఆదివారం బహూకరించారు. సేవ్ గర్ల్ చైల్డ్ కార్యక్రమంలో భాగంగా ఓ సినిమా షూటింగ్ నిమిత్తం ప్రొద్దుటూరు వచ్చిన ఎఎం రత్నంకు స్వీయ చిత్రపటాన్ని బహుకరించారు. రుణ హత్యలు పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో అమ్మ లేక సమాజం అనాథగా మారుతుందని గ్రహించి బాలికల విద్యలో తల్లిదండ్రులు సమాజం ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చిత్రకారుడు తెలిపారు.మహిళలు చదవాలంటే సమాజం మారాలి అనే తాత్పర్యాన్ని విషయీకరిస్తూ బాలికల రక్షణకు తన వంతు కృషి చేస్తానని రత్నం సూచించారు. కార్యక్రమంలో సేవ్ గర్ల్ చైల్డ్ ప్రాజెక్ట్ సలహాదారులు సాదు పద్మభూషణ్, సభ్యులు నారాయణ, ఆర్టిస్ట్ కుమారి ప్రసన్న పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని 33/11కెవి 3సబ్ స్టేషన్ల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఎఇ రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపడుతున్న సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు బి.మఠం, మల్లేపల్లె, టి.చౌదరివారిపల్లె సబ్‌స్టేషన్స్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని రైతులు, ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు. బద్వేల్ డిఇఇ కుళాయప్ప ఆదేశాల మేరకు మరమ్మతులు చేపడుతున్నామన్నారు.

ఘనంగా గుర్రప్ప జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ముద్దనూరు

పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణ జిల్లా అధ్యక్షులు, గురుసాయి ట్రాన్స్‌పోర్ట్ అధినేత గురప్ప జన్మదిన వేడుకలను ఆయన సతీమణి ఉమాదేవి ఘనంగా నిర్వహించారు. తాడిపత్రి రహదారిలోని శ్రీగురుసాయి లారీ ట్రాన్స్ పోర్టులో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల మధ్య గుర్రప్ప కేక్ కట్ చేశారు. సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఓబులేసు యాదవ్, విజయ్, ప్రభాస్, రమేష్, దస్తగిరి, రంగనాయకులు, ప్రదీప్ శుభాకాంక్షలు తెలిపారు.



నత్తనడకన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు

ప్రజాశక్తి - చాపాడు


పనుల్లో భాగంగా చదును చేసిన పంట పొలాలు

మండల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న నాలుగు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు ముందుకు సాగడం లేదు. గత ఏడాది జిపిఎస్ విధానంలో సర్వే చేసి రాళ్లు వేసి, హద్దులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జెసిబి యంత్రాల ద్వారా పంట పొలాలను చదును చేసి కొన్ని ప్రాంతాల్లో గ్రావెల్ మట్టి తోలారు. పనులు నిలిపేశారు. ఇందుకు కారణం గ్రావెల్ సమస్య అని సమచారాం. గత వారంలో దువ్వూరు మండల పరిధిలో అనుమతి లేకుండా శుద్ధ మట్టి తోలుతున్న 10 ట్రిప్పర్లు ఒక జెసిబి యంత్రాన్ని దువ్వూరు తహశీల్దార్ సీజ్ చేశారు. మెగా కంపెనీ వారికి స్థానికంగా అధికార పార్టీ నాయకులకు మధ్య సఖ్యత కుదరకపోవడంతో పనులు ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. గ్రావెల్ మట్టి తరలించేందుకు ప్రభుత్వానికి పన్ను చెల్లించాలని అధికారులు పనులకు అడ్డు చెబుతున్నారు. మండల పరిధిలో భూసేకరణలో భాగంగా గుర్తులు ఏర్పాటు చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించారు. కొంతమంది రైతులకు నష్టపరిహారం అందలేదు. అలాంటి రైతుల వివరాలు సేకరించి పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని అనంతపురం, బూడిదపాడు, కుచ్చుపాప, అల్లాడుపల్లె, సోమాపురం, పిచ్చపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో 350 ఎకరాల వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కోసం ఉపయోగిస్తున్నారు. ఆంధ్ర కర్ణాటక సరిహద్దులోని అనంతపురం జిల్లా కోడికొండ వద్ద హైదరాబాద్-బెంగళూరు 44వ జాతీయ రహదారి నుంచి చెన్నయ్, కలకత్తా హైవేపై కి నూతనంగా నాలుగు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం చేపట్టేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకుంటోంది. పాత రోడ్డు కాకుండా పూర్తిగా నూతన నాలుగు లైన్ల రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపడుతోంది. ఆ మేరకు జిల్లాలో 125 కిలోమీటర్లు మేర రోడ్డు నిర్మించేందుకు 1100 హెక్టార్లు భూములను వినియోగించనున్నది. 60 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కొన్ని ప్రాంతాల్లో పనులు కూడా పూర్తయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో పనులు ప్రారంభం కాలేదు.ఈ రోడ్డు పూర్తయితే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు మన జిల్లా నుండి సులభంగా ప్రయాణించేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలో పులివెందుల, కమలాపురం, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల గుండా ఈ రహదారి నిర్మించేందుకు డిపిఆర్ సిద్ధం చేశారు. ప్రస్తుతం నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది మండల పరిధిలో రోడ్డు నిర్మించే ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణానికి పిల్లర్లు వేసి సర్వే కూడా పూర్తి చేశారు. ఈ వేసవిలో రోడ్డు పనులు వేగవంతం చేస్తారని భావించినా ఏమాత్రం ముందుకు సాగడం లేదు. యర్రగుంట్ల నుంచి పోరుమామిళ్ల వరకు మెగా సంస్థ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

రాయితీ రుణాలు.. నాయకులకు వరాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో వివిధ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలను మంజూరు చేస్తూ వస్తోంది. ఇటీవల బిసి కార్పొరేషన్ ద్వారా యువత, నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు దరఖాస్తుకు అవకాశం కల్పించింది. నిరుద్యోగ యువత రాయితీ రుణాల ప్రకటన పట్ల సంతోషం వ్యక్తం చేసింది. అర్హత మేరకు రుణం మంజూరైతే చిన్నపాటి వ్యాపారాలు నిర్వహించుకుంటూ ఉపాధి పొందచ్చని ఆశపడ్డారు. రాజకీయ నాయకులు తమ ఆశలను అడియాశలు చేశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణాల మంజూరులో రాజకీయ నాయకుల ప్రమేయం, వారికి అధికారులు వత్తాసు పలకడం వల్ల నిరుద్యోగులు నష్టపోవాల్సి వచ్చిందని, యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూ, యూనిట్ల మంజూరు విషయం వరకు అంతా రాజకీయ ప్రమేయంతోనే జరిగాయని ప్రజలు పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులు కూడా రాజకీయ నాయకుల పక్షాన్నే ఉంటున్నారని మరికొందరు ఆరోపిస్తున్నారు.

అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు..

రాయితీ రుణాల ఎంపిక ప్రక్రియలో అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రాయితీ రుణాల ప్రకటనకు సంబంధించి అధికారులు పూర్తి వివరాలు వెల్లడించకుండా మీడియాకు అసంపూర్తి సమాచారం అందించారు. ఎన్ని యూనిట్లు మంజూరయ్యాయని, వాటి సంఖ్య తెలపాలని అధికారులను మీడియా కోరినా ఏమాత్రం లెక్కచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రాయితీ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు కూడా మొక్కుబడిగా నిర్వహించారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. రాయితీ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూ పూర్తయిని జాబితా వెల్లడించడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారు. రాయితీ రుణాల అర్హుల జాబితా అధికారులు ప్రకటించకపోవడం పట్ల నిరుద్యోగ అభ్యర్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాయితీ రుణాలన్నీ పలుకుబడి ఉన్న వ్యక్తులకు, రాజకీయ నాయకుల కుటుంబికులకు మాత్రమే మంజూరయ్యాయనే ఆరోపణలున్నాయి. సామాన్యులకు మొండి చేయి చూపి మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంపిడిఒ కార్యాలయం పూర్తిగా నాయకుల కనుసన్నుల్లో నడుస్తోందని, సామాన్య ప్రజానీకం మాట అధికారులు వినిపించుకోవడంలేదని వారి తీరును ప్రజలు తప్పుపడుతున్నారు.

రుణాల మంజూరులో అధిక భాగం నాయకులవే..

రాయితీ రుణాల మంజూరులో ఎక్కువగా రాజకీయ ప్రమేయం చోటుచేసుకుంది. నాయకులు వారి సన్నిహితులు, కుటుంబికులకు మాత్రమే మంజూరయ్యాయని చర్చలు జరుగుతున్నాయి. రాయితీ రుణాలు రాజకీయ నాయకులకు వరాలుగా, నిరుద్యోగ యువతకు అందని ద్రాక్షలా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, అధి కారులు నిష్పక్షపాలన అందించి ప్రజల మెప్పు పొందాలని ప్రజలు కోరుతున్నారు.


పశువైద్య విద్యార్థుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్టయిఫండ్ విషయంలో పశువైద్య విద్యార్థులు 28రోజులుగా చేస్తున్న నిరసన దీక్షలో ఆదివారం వారు ప్లకార్డులు ధరించి, మోకాళ్లలపై వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఇన్నిరోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పశువైద్య విద్యార్థులకు గౌరవ వేతనం పెంచాలని దీక్ష చేపడుతూన్నామన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు కానీ స్పందించడం లేదన్నారు. ప్రభుత్వం వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులనందరినీ ఒక్కలా చూడాలని సూచించారు. స్టయిఫండ్ విషయంలో ప్రభుత్వం ఆలోచించాలన్నారు


మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న విద్యార్థులు

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి


మాట్లాడుతున్న డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో సోమవారం నుండి ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఇందులో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా జిల్లా అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ కోరారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సిసి కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించాలన్నారు. పట్టణంలో ఓపెన్ ఇంటర్ పరీక్షలు నిర్వహణకు విద్యార్థుల వద్ద నుండి మాస్ కాపీయింగ్ కోసం ఒకొక్కరి వద్ద వేల రూపాయలు వసూలు చేశారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు నిర్వహించి, అమాయకపు పేద విద్యార్థుల వద్ద మాయమాటలతో కాపీలు నిర్వహిస్తాం, మీ తరుపున వేరే వారితో కూడా పరీక్షలు రాయిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఎక్కువ డబ్బులు ఎందుకు ఇవ్వాలని విద్యార్థులు ప్రశ్నిస్తే జిల్లా కో-ఆర్డినేటర్, అధికారులకు కూడా మామూలు ఒక్కో విద్యార్థికి రూ.400 ఇస్తున్నామని బదులిస్తున్నారని తెలిపారు. యథేచ్ఛగా మాస్ కాపీయింగ్‌కు డబ్బులు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు అనిల్, తులసి పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలతో రంజాన్ ప్రారంభం

ప్రార్థనలకు మసీదులు ముస్తాబు - విద్యుత్ దీపాలతో అలంకరణ

ప్రజాశక్తి - వేంపల్లె

ఖురాన్ గ్రంథం భూమిపై ఆవిర్భవించిన నెలను రంజాన్ మాసంగా ఇస్లాం గ్రంథాలు చెబుతున్నాయని ముస్లిం మతపెద్దలు పేర్కొంటున్నారు. మానవ జీవితంలో కోరికలను నియంత్రించి మనస్సును భగవంతుడిపై లగ్నం చేసే మహోత్తర ప్రక్రియ రంజాన్ రోజుల్లో కొనసాగుతుంది. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ మాసం.

ఉపవాస దీక్ష.. ఆత్మ శరీర ప్రక్షాళన

ముస్లింలు శనివారం సాయంత్రం ఆకాశంలో నెల వంక కనిపించడంతో ఆ రాత్రి తరావీ సమాజుతో రంజాన్ ప్రారంభమైంది. ఆదివారం నుంచి రంజాన్ ఉపవాసాలు ప్రారంభమయ్యాయి. రంజాన్ మాసానికి ఇస్లాంల్లో అత్యంత ప్రాధాన్యత ఉంది.

ఫిత్రా పేరుతో దానం

రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఫిత్రా పేరుతో పేదలకు తన వద్ద అవసరానికి మించి ఉన్న ధనంతో రెండున్నర శాతం విధిగా దానం చేయాలి. అలా చేసినప్పుడే వారు సంపాదించిన ధనం పరిశుద్ధం అవుతుంది. సమాజంలో పేదరిక నిర్మూలన జరుగుతుందని జకాత్ ఆశయం. ఫిత్రా రూపంలో పేదలకు దాన, ధర్మాలు చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడంతో ప్రతి ముస్లింలో దాతృత్వం పెరుగుతుంది. నిర్మల మనసుతోపాటు ప్రశాంతత నేర్పుతుంది. రంజాన్ నెలలో ప్రతి రోజూ రాత్రి సమాజ్ తర్వాత 30 రోజుల ప్రత్యేక తరావీ నమాజ్ చేస్తారు. దివ్య ఖురాన్‌లోని 30 భాగాలను ఈనెలలోనే 100 రోజుల్లో పూర్తి చేస్తారు. ఇది దైవంపై భక్తిని పెంచడంతోపాటు చెడు అలవాట్లను దూరం చేస్తుంది.

ఇఫ్తార్.. సోదర సౌభ్రాతృత్వం

రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు విరమించే సమయంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులో సోదర భావంతో సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తారు. ఈ సమయంలో చిన్న, పెద్ద, పేద, ధనిక


విద్యుద్దీపాలకంరణలో మసీదు

తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరూ రంజాన్ నెల ఆరంభం నుంచే ముస్లింలు 30 రోజులపాటు ఉపవాస దీక్షలు పాటిస్తారు. ఇందులో భాగంగా వేకువ జామున 4గంటలకు అల్పాహారాన్ని తీసుకుంటారు. దీన్ని సహారీ అంటారు. అప్పటి నుంచి సాయంత్రం సూర్యాస్తమయం వరకు ఎలాంటి ఆహార, పానీయాలు తీసుకోకుండా అత్యంత కఠోర దీక్షను పాటించి తర్వాత దీక్షను విరమిస్తారు. దీన్ని ఇఫ్తార్ అంటారు. ఉపవాస దీక్షలతో ఆత్మ శరీర ప్రక్షాళన జరగడంతోపాటు పేదల ఆకలి, బాధ తెలుస్తుంది. తద్వారా ధర్మాలు చేసే గుణం అలవాటు పడుతుంది. ముఖ్యంగా ఐక్యత, సోదర భావం పెరుగుతుంది.

ముస్తాబైన మసీదులు..

ఉపవాస దీక్ష పాటించే సమయంలో తప్పనిసరిగా ముస్లింలు నమాజ్‌ల్లో పాల్గొంటారు. మండలంలోని అన్ని మసీదుల్లో ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యుదీదపాలతో మసీదులను అలంకరించారు. సహారీ కోసం ఆయా మసీదుల వద్ద తెల్లవారుజామున వంటకాలు చేస్తున్నారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రూరల్ సిఐ రమణ

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని పులివెందుల రూరల్ సిఐ రమణ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని నిడివెల సమీపంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాకీ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వం బాలికలు, మహిళల కోసం ప్రత్యేక చట్టాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తులసి నాగ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ గురుదేవి పాల్గొన్నారు.


డాక్టర్ వరుణ్‌ను సత్కరిస్తున్న సంఘ నాయకులు

జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా వరుణ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనను నియమించినందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు, ఎమ్మెల్యే వరదరాజులురెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వ వైద్యశాలలో సదుపాయాలు మెరుగుపడేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ నాయకులు చలపతిరావు ఆధ్వర్యంలో వరుణ్ కుమార్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

నిధులు తేవడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

టిడిపి కూటమి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ కూతల, కోతల బడ్జెట్‌ను తలపిస్తోందని పిసిసి అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మొత్తం బడ్జెట్ రూ.3,22,359కోట్లలో రూ.1,04,383కోట్లు అప్పు అన్నారు. గత వైసిపి ప్రభుత్వం శక్తికి మించిన అప్పు చేసిందని చెప్పిన కూటమి ప్రభుత్వం, ప్రస్తుతం అంతకు మించి అప్పు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలో ఉన్నప్పటికీ కేంద్రం నుండి గ్రాంట్లు తేవడంలో బాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సాగునీటి రంగాన్ని చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. సమావేశంలో ప్రొద్దుటూరు కాంగ్రెస్ నాయకులు షేక్ పూల నజీర్, ప్రొద్దుటూరు మాజీ పట్టణ అధ్యక్షులు జీలాని బాషా, ఖాజాపీర్, సమీర్, షంషీర్, మహమ్మద్, సాహిల్, అమర్నాథరెడ్డి, ఉత్తన్న, రమణ, నాగరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీపతి చిన్న బాలుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి సహకారంతో డ్యాన్స్ మాస్టర్ రాజా ఆధ్వర్యంలో శ్రీరాజా కళా నిలయం చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో శిల్పారామం అధికారి సుధాకర్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, ఫీల్డ్ సూపర్వైజర్ ఇస్మాయిల్, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

క్రైం కార్నర్

చేపల కోసం వెళ్లి

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం


మృతి చెందిన నాగరాజు

మండలంలోని కొత్త బస్వాపురం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై తొర్రివేముల నాగరాజు (35) అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడు చేపలు పట్టేందుకు వల తీసుకుని గ్రామానికి సమీపంలో ఉన్న వంకలోకి వెళ్లాడు. నీటిలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు.. తోటలోకి పందుల వస్తు న్నాయని రైతు విద్యుత్ వంకపై నుండి లాగాడు. ఆ విద్యుత్ తీగ తగిలి చని పోయాడు. ఈతకు వెళ్లిన పిల్లలు నీటిలో నాగరాజు మృతదేహాన్ని చూసి గ్రామ స్తులకు తెలిపారు. గ్రామస్తులు సంఘటనాస్థలం చేరుకుని పోలీసులకు సమా చారమిచ్చారు. ఎఎస్ఐ గుర్రప్ప, కానిస్టేబుల్ ఓబుళయ్య మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టమ్ నిమిత్తం బద్వేల్ ఆస్పత్రికి తరలించారు. కేసు విచారిస్తున్నారు.